# జీవాతువు

నిడదవోలు మాలతి

✍

''అరుంధతి వెళ్లిపోయింది''

''పోయిందా?'' అన్నాను తృళ్లిపడి.

నాగమణి వెకిలిగా నవ్వింది. ''హుమ్. వెళ్లిపోయింది'' అంది.

ఎందుకు వెళ్ళిపోయింది? ఎలా వెళ్లిపోయింది? ఎక్కడికి వెళ్లిపోయింది?

కాని నాగమణిని అడిగి లాభంలేదు. నాగమణి సర్గైన జవాబు చెప్పదు సరికదా, పైపెచ్చు అవాకులూ, చెవాకులూ పేల్తుంది.

కాని నాగమణి ఊరుకోదు.

''అత్తాకోడళ్లు పేచీ పడ్డార్ట''

✍✍

అయిదేళ్లపాటు అత్తింటివారిని అడ్డాల్లో బిడ్డాల్ని సాకినట్టు సాకిన అరుంధతి ఎక్కడికి, ఎలా, ఎందుకు వెళ్లిపోయిందో నాకర్థం కాలేదు.  ఒక నిర్దుష్టమైన సంస్కారాన్ని అలవర్చుకుని, ఆచరణలో పెట్టి నలుగురిచేతా శభాషనిపించుకున్న అరుంధతి చవకబారు హోటల్లో

సర్వరులా, అత్తగారితో పేచీ పడి వెళ్లిపోయిందంటే.. ఆమాట నాకర్థం కాలేదు.

''ఏమైనా బరువు మోస్తున్నట్టు నటించడం, బాధ్యతలు తప్పించుకోవడం, కొమ్మెత్తే వేళకి భుజం తప్పించడం అదీ ఒక నేర్పే,'' అంది నాగమణి.

నాగమణికి మహాభారతం చూపించి 'ఏమిటిది' అని అడిగితే, ఎర్రట్ట బొండు బుక్కు అని చెప్పగలదు. కుడిచేతివేళ్ళూ ఎడంచేతిరెండు వేళ్లూ చూపించి 'ఎన్ని?' అంటే, 'రెండు రెళ్లు' అంటుంది. కాకపోతే, 'నీరెండు చేతులకీ నాలుగు వేళ ్లున్నాయా?' అని అడుగుతుంది. నాగులకి చెవుల్లేవని జనవాక్యం. నాగమణికి చెవులూ, బుర్రా కూడా లేవు.

గబ గబ నాపని ముగించుకుని, వెయిటింగ్‌రూంకి వెళ్లిపోయాను.

✍✍

అరుంధతితో నాకు పరిచయం రెండేళ్ల కిందట అనుకుంటాను. ఒక రూం అద్దెకి తీసుకుని చదువుకుంటుండేదాన్ని.

ఆవేళ ఆదివారం. ఎండ నిప్పులు చెరుగుతూంది. క్లాసుకి సంబంధించిన పుస్తకం ఒకటి పుచ్చుకుని మంచం, పక్కా అన్నీ ఏర్పాటు చేసుకుని పడుకున్నాను, చదువుదాం అన్న సదభిప్రాయంతోనే. నిద్ర కాకపోయినా, ఎండపాడకి కళ్ళు మూసుకుపోత ున్నాయి, నా ప్రమేయం లేకుండానే. ఇంటివారి కోడలు పాపని పిలవడం వినిపిస్తూంది, దూరంగా 'పారా హుషార్' అన్నట్టు.

''పాప మీఇంట్లో ఉందాండీ?'' అంటూ చేరవేసిన తలుపు ఓరవొంపుగా తోసుకు, తొంగిచూస్తూ ప్రశ్నించింది.

''లేదండీ,'' అన్నాను, మత్తుగా, మంచంమీంచి లేవకుండానే.

‘‘..ఇంతట్లోకే ఎక్కడికి వెళ్లిపోయిందో?’’ అన్న మాటలు నేపథ్యంలో లీలగా వినిపించి అంతమైపోయాయి.

మళ్లీ ‘‘పాపా,.. పాపా...’’ అంటూ మూడో, నాలుగో ప్రసారాలూ, ఆవిడ ఇంకెవరితోనో ఏదో అన్నట్టు, ఇంకో కొత్త స్వరమూ..

‘‘క్షమించండి. పాప మీగదిలోకి రావడం నేను చూశాను.’’

తృళ్ళిపడి లేస్తూ, ‘‘ఫరవాలేదులెండి, రండి’’ అన్నాను.

అరక్షణంసేపు – నిద్ర తూలగొడుతూంది. గుమ్మంలో నిలబడిన వ్యక్తి నా మత్తు తేలగొడుతూంది. లేత ఊదారంగు వాయిల్ చీరా, మంకెనపువ్వు రంగు జాకట్టూ, మొహంలో స్నిగ్ధ ఛాయలు, ఎక్కడయినా చూశానో? చూసినట్టు ఊహిస్తున్నానో?

‘‘మంచినిద్ర చెడగొట్టినట్టున్నాను.’’ ఆ స్వరంలో క్షమాపణలు ధ్వనించాయి.

‘‘అఁ. లేదండీ’’ అని, లోపలికి రమ్మని, ‘‘పాప లోపలికి రావడం నేను చూడలేదండీ’’ అన్నాను, మొదటి ప్రశ్నకి సమాధానంగా. అంటూ, మంచందిగి గదిలో చుట్టూ చూశాను.

‘‘భయపడనక్కర్లేదని మీరు చెప్పండి,’’ అంది ఆవిడ నామంచంకిందకి సౌంజ్ఞ చేసి చూపిస్తూ.

అటు చూశాను. మంచంకిందనించి కవటాకుల్లాటి చిన్ని పాదాలు రెండు దర్శనమిచ్చిందాకా ఆవిడ మాటలు నాకు బోధ పడలేదు.

నవ్వుతూ, ఆ రెండు పాదాలు పుచ్చుకు మెల్లిగా లాగాను. నావెనక ఎవరున్నారో పాప చూడలేదు.

‘‘స్. స్. ప్రైవేటు మేష్టరు’’ అంది లక్కపిడతలాటి నోటిమీద మావిడిచివుళ్లలాటి వేళ్లు కదిలిస్తూ.

‘‘ఏమిటీ?’’

‘‘ప్రైవేటు చెబుతుందిట’’ ––క్లాక్‌టవర్ మీంచి కిందకి దూకుతుందిట అన్నంత బెదురుతో.

‘‘నాక్కూడానా?’’

పాప నావేపు అయోమయంగా చూసింది.

‘‘చదువుకోకపోతే, ఎలా?’’ అంది పాపతల్లి కఠినంగా.

‘‘ప్రవేటు నాకు చెప్పండి, పాపకక్కరలేదు’’ అన్నాను, పాపవేపు,ఆ ప్రైవేటుమేష్టరు వేపు చూస్తూ.

తీరా అనేసింతరవాత, ఎందుకలా అన్నానా అనిపించింది.

‘‘నేను ప్రైవేటు చెప్పను,’’ అందావిడ. అసలు వున్న ‘మిస్చీఫ్’ అంతా ఆ పదంలోనే ఉంది. అది ఆవిడ గ్రహించింది.

‘‘చెప్తావు’’ అంది పాప పాడిచేశాలా చూస్తూ.

‘‘చెప్తారు అనాలి’’ అంది పాప తల్లి, ఓ చిన్న మొట్టికాయ వేసి.

పాప బుంగమూతి పెట్టుకు నిలబడింది.

గురుత్వం వహించను వచ్చిన ఆ మానవురాలు ,‘‘వస్తానండీ’’ అంది, మెనుదిరగబోతూ.

‘‘సర్లెండి. తరవాత చూద్దాం’’ అంది పాపతల్లి.

ఆవిడ నాదగ్గిర కూడా శలవు తీసుకుని వెళ్ళిపోయింది.

‘‘అంటీ ముట్టనట్టు అలా దూరంగా నిలబడితే, ఇవాళ కాదు, రేపైనా దీన్నెలా దారికి తెస్తుంది? పాఠాలెలా చెబుతుంది?’’ అంది పాపతల్లి, చేతులూ, కళ్లూ తిప్పుతూ.

‘‘ఆవిడే చెప్తుంది. పాపే వింటుంది’’ అన్నాను.

మర్నాడు నేను కాలేజీనించి వచ్చేసరికి, ఎదురుగుండా సోఫాలో పాపా, వాళ్ళ ‘ప్రైవేటు మేష్టరూ కనిపించారు. ఆవిడ నన్ను చూసి మందహాసం చేసింది. అంతే.

ఆవిడ పేరూ, వివరాలూ కనుక్కోడానికి నేనెప్పుడూ ప్రయత్నించలేదు. కాని, పాప మటుకు ఆవిడంటే ఊః ఇదయిపోయేది.

ప్రైవేటు మొదలుపెట్టి మూడు నెలలయిందేమో, పాపవాళ్ళ నాన్నగారికి బదిలీ అయిపోయింది. అరుంధతి, అదే, పాప ప్రైవేటు మేష్టరు, చాలా విచారించింది.

ఆ తరవాత పదిహేను రోజులనాడు హఠాత్తుగా మళ్లీ అరుంధతి ప్రత్యక్షమయేసరికి ఆశ్చర్యపోయాను.

‘‘పాప బాగా అలవాటయిపోయిందండీ, సాయంత్రాలేమీ తోచడం లేదు,’’ అంది.

‘‘నిజమేనండీ. రండి,’’ అన్నాను ఆహ్వానపూర్వకంగా.

రెండు, మూడు రోజులలో పాప పుట్టినరోజు వస్తోందిట. నాకు తెలీనే తెలీదు. ఎడ్రెస్ ఇస్తే, తను ఎంబ్రాయిడరీ చేసిన గౌను పంపిస్తుందిట.

గౌను చూపించింది నాకు. మంచిపనివాడితనం ఉంది అందులో, ఏదో మొక్కుబడికోసం చేసినట్టు కాక. ఒకవేళ ఈ కమనీయ కళాఖండం వెనక ఏదైనా కన్నీటి గాథ దాగివుందేమో--అనుంగు చెల్లి, అలవాటైన అన్నకూతురూ... ఇంకెవరైనా...

నా ఆలోచనకి నాకే చిరాకేసింది.

‘‘పంపించండి’’ అన్నాను, గౌను తిరిగి ఇచ్చేస్తూ.

అప్పుడు అడిగేను, అరుంధతిని, ‘‘మీరేం చేస్తున్నార’’ని.

ఇంటర్మీడియట్ పాసయి, సెకండరీ గ్రేడ్ ట్రైనింగయిందిట. ఉద్యోగంకోసం చూస్తోంది.

‘‘నేనూ బి.యే.కి కడతానండీ’’ అంది నాపుస్తకాలు ఒకొకటే చూస్తూ.

‘‘మంచిదే. అయం ముహూర్తో సుముహూర్తోస్తు’’

‘‘మరి మీరు నాకు సాయం చేస్తారా?’’

‘‘సాయమా?’’

‘‘ఏం?’’

‘‘ఏం ఏమిటండీ. నాదే ముప్ఫై తొమ్మిది పర్సెంటు నాలెడ్జి. పరీక్ష చెట్టెక్కుతుందో, గట్టెక్కుతుందో? అని నేన్భూస్తున్నాను. నేను మీకు చెయ్యగల సాయం నోరు మూసుక్కూచోడమే.’’

‘‘నేనేమీ హాస్యాని కనడం లేదు. మీ చదువు అయిపోగానే, మీ నోట్సు మరెవరికీ ఇవ్వకండి,’’ అంది తను సీరియస్‌గా.

‘‘ఇచ్చినా, పుచ్చుకున్న వాళ్ళు తరవాత తిట్టుకుంటారు. అంతకంటె ముందు మాట– నా చదువు అయిపోవాలంటే,

యూనివర్సిటీ వాళ్లు, బి.యే. ఎత్తేయాలి. ఇప్పుడు ఇంటర్మీడియట్ ఎత్తేసి, కొందరి చదువులు పూర్తి చేసేసినట్టుగానే.''

అరుంధతి నవ్వుతూ, ''బలేవారండీ, మీరు,'' అంది.

తరవాత అరుంధతి వెళ్లిపోయింది. పై చదువులు చదివించనూ లేక, పెళ్లీ చెయ్యలేక తల్లిదండ్రులు ట్రైనింగుకి పంపించేరు కాబోలు అనుకున్నాను. పెద్ద కుటుంబం కాబోలు. అదే నిజమైతే, ఇంకా బి.ఎ.కి కట్టి, బి.ఇడి. కి కట్టి,.. ఎప్పుడు అవుతాయి ఇవన్నీ. వెనకవాళ్లని ఉద్ధరించేదెప్పుడు? మనిషి కూడా ఖర్చుదారులా కనిపిస్తోంది. అరుంధతి విషయంలో నేను ఒక  నిర్ణయానికి రాకుండానే తెల్లారిపోయింది.

పుస్తకాల విషయంలో మాత్రం ఒక నిర్ణయానికొచ్చేను. చేతిలో డబ్బు చీరలమీద పెట్టి, పుస్తకాలు ఎరువు అడిగేవారంటే నాకు భయం. అలాటిఅప్పు ఇచ్చినవాళ్ళకే కాని, పుచ్చుకున్న వాళ్ళకి జ్ఞాపకం ఉండదు.

అరుంధతి బి.ఎ. చదివే ఉద్దేశం ఇనప్పెట్టెలో పెట్టి, మునిసిపల్ గర్ల్స్ స్కూల్లో సెకండరీ గ్రేడ్ టీచరుగా చేరిందని తెలిసినప్పుడు మాత్రం మనసులో ఏమూలో కలుక్కుమంది.

''అందరిలాగే మీరూ ఆశ్చర్యపోతున్నారా?'' అంది ఓ రోజు, స్కూలికి తను నడిచి వెళ్లే విషయమై.

''ఆశ్చర్యం కాదు కానీ,'' అన్నాను నసుగుతూ.

''మా నాన్నగారు బరంపురంనించి కాకినాడ నడిచి వెళ్ళారంటే, నేను నమ్మేను. నేను ఇక్కడ్నుంచి స్కూలికి నడిచి వెళ్తున్నానంటే ఆశ్చర్యపోయేవాళ్లూ, ముక్కున వేలేసుకునేవాళ్ళూ, మూర్ఛపోయేవాళ్లూనూ...'' అంది తను.

తను చెప్పిందాంట్లో నిజం లేకపోలేదు. బస్సుకోసం నిరీక్షించే టైములో, బస్సులో చోటుకోసం పడే బాధలో, కాలేజీ అవ్‌లో బస్సు చేసే రొదలో నూరోవంతు బాధ ఉండదు – నడిచివెళ్ళడంలో. అయినా ఏమిటో 'నడక' అనగానే ఏమిటోగా ఉంటుంది...

''ఏమోలెద్దురూ. ఎవరేం అనుకున్నా, నాకు మాత్రం నడవడం హాయిగా ఉంది.''

నిజమేనేమో. పొద్దున్న తొమ్మిదిగంటలకి చేసిన భోజనం, పగలల్లా క్లాసులూ, మళ్లీ దాదాపు మూడు మైళ్లు నడిచిన అరుంధతి వసి వాడలేదంటే తనకి హాయిగా ఉండే ఉండాలి.

''వస్తానండీ'' అంది లేచి నిలబడుతూ.

''కూచుందురూ. వెళ్ళొచ్చు. తొందరేమిటి'' అన్నాను, చేయి పుచ్చుకు ఆపడానికి ప్రయత్నిస్తూ.

''లేదండీ. ఆరున్నరయేసరికి మా అత్తగారికి ఫలహారం అయిపోవాలి''

''అత్తగారా!'' అనేసి, చప్పున నాలుక్కరుచుకున్నాను.

అప్పటివరకూ తన మెడవేపు పరీక్షగా చూడలేదు నేను. నా మొహంలో ఏసంగతి తనకి నవ్వు తెప్పించిందో చెప్పలేను కాని, ''ఒకళ్ళు కాదు, ఇద్దరూ,'' అంటూ నవ్వుతూ వెళ్ళిపోయింది అరుంధతి.

అరుంధతికి పెళ్లి అయింది. అరుంధతిని పెళ్లి చేసుకున్న ఆ పురుషపుంగవుడు రెండు యమ్మే డిగ్రీలూ, ఒక లా డిగ్రీ తెచ్చుకున్న బృహస్పతి. అతనికి కన్నతల్లి కాక మరొక పెంపుడు తల్లి– ఇతగాడిని పెంచుకున్న తల్లి ఉంది. కన్నతల్లికి ఒక కూతురూ, మరో ఇద్దరు మొగపిల్లలూ ఉన్నారు. అరుంధతి పెళ్లినాటికి ఇంటర్మీడియట్ పాసయింది.

పెళ్లయిన మూడోనెలనించీ అతను ఒకటే గొడవ ''తను ట్రైనింగ్‌కెందుకు వెళ్లకూడద''ని.

''ఆమాటల్లో ఆంతర్యం అప్పట్లో నాకు తెలీనే లేదు'' అంది అరుంధతి కళ్ళనీళ్లు పెట్టుకుంటూ.

అరుంధతి ట్రైనింగయిన వారంనాడు, తననీ, ఇద్దరు తల్లుల సంపదనీ భరించవలసిన మగవాడు పరారీ!

అరుంధతి నిశ్చేష్ట అయి నిలబడిపోయింది.

''జరిగినసంగతేమిటో నీకు తెలీకుండా ఉంటుందా? నిజం చెప్పు'' అని తననే నిలవేయ సాగారు అత్తగారూ, ఆడబడుచులూను. అతని పెంపుడు తల్లి కూడా ఆ మాటే అంది.

ఆపరిస్థితుల్లో తాను చేయగలిగింది ఏమీ లేదు. పోనీ,పోదాం అంటే అరుంధతికి పుట్టిల్లంటూ ఏమీ లేదు. తల్లి లేదు. తండ్రికివన్నీ అనవసరమైన అనుబంధాలుగా తోచేయి. పినతల్లీ, పినతండ్రీ అరుంధతికి కన్నెచెర విడిపించి చేతులు కడుక్కున్నారు. ఇహ ఏదో ఉద్యోగం చేసి, వచ్చిన నాలుగు రాళ్ళతో అత్తా, ఆడబడుచులమధ్య కాలం గడపుకోడమే మిగిలింది.

''నలుగురు పిల్లలకి ప్రైవేట్లు చెబుదాం అనుకుంటున్నాను'' అని అరుంధతి అన్నప్పుడు ఏమనాలో నాకు తెలీలేదు. ఈ ఆరు నెలల్లోనూ తను తోటకూర కాడలా వాడిపోయింది. అవ్యక్తానందంతో మెరిసే కళ్ళు ఆర్ద్రంగా తిరిగేయి. స్నిగ్ధ సౌరభాలను వెదజల్లే పెదవి పుచ్చిన చిక్కుడుకాయిలా ముడుచుకుపోయింది.

''సాయంత్రంవేళల్లోనూ, మధ్యాహ్నం ఒంటిగంటా–రెండు గంటల మధ్య వీలుంటుంది'' అంది తనే మళ్లీ.

రూపాయి, రూపాయికి రక్తపుబొట్టు రాలుస్తున్నది. మొదటికే మోసం రావచ్చు అనుకున్నా నాలో నేను.

''ఆరోగ్యం కూడా చూసుకోవాలి కదా! మీరు పడుకుంటే గ్లాసుడు మంచినీళ్లు కూడా ఇవ్వరెవరూ, లెఖ్కకి చాలామందే ఉన్నా,'' అన్నాను.

''అలా ఆలోచిస్తే అందరం పడుకోవలసి వస్తుంది, అనతికాలంలోనే,'' అంది అరుంధతి నవ్వుతూ. ఆ నవ్వులో ఇదివరకులా జీవం లేదు.

అవును. తను తెచ్చే నెలసరి ఆదాయం బియ్యపుబస్తాకి సరిపోతుంది. 'మధ్య తరగతివారి బడ్జెట్, ఒక కుటుంబంలో ఒక భార్యా, ఒక భర్తా, ఇద్దరు పిల్లలూ ఉన్నారనుకుందాం' అంటూ వేసే ఊహాలోకపు బడ్జెట్ కుదరదు ఇక్కడ. ఆయింట్లో ఖచ్చితంగా నలుగురు పెద్దవాళ్ళు, ముప్పొద్దులా తినే ముగ్గురు పిల్లలూ ఉన్నారు. అందరికీ అన్నీ కావాలి. అసలు అత్తగారికి పొద్దున్న ఫలహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం కాఫీ కావాలి. పెంపుడ ఎతల్లికి తొమ్మిదికల్లా భోజనం, మధ్యాహ్నం టీ, రాత్రి చపాతీలూ కావాలి. పెద్ద ఆడబడుచు నియమనిష్ఠలతో తనపాట్లు తనే పడుతుంది. చిన్నాడబడుచు స్కూలికెళ్తుంది, తోచక. మొగపిల్లలిద్దరిదీ – చద్దన్నం తింటాను, వేడన్నం తింటాను, మామగారితో మళ్ళీ తింటాను– అన్న తంతు.

''వీళ్ళందరితో ఎలా నెగ్గుకొస్తున్నారు?'' అని నేనంటే,

''పోనిద్దురూ, ఎలా ఉన్నారోజు గడిచిపోతుంది కదా!'' అంటుంది అరుంధతి తేలిగ్గా.

రోజులు గడిచిపోతాయా?

ఆ తరవాత నెలా, నెలాపదిహేను రోజులపాటు అరుంధతి కనిపించలేదు. పరీక్షలు దగ్గిరకొస్తున్నాయి అన్న హడావుడిలో నేనూ అంతగా తన విషయం పట్టించుకోలేదు.

చలి వేస్తూందని కిటికీతలుపులదగ్గిర్నుంచీ అన్నీ వేసుకుని కూర్చున్నా. 1868 కన్వెన్షనూ, సూయజ్ క్రైసిసూ– ఏమిటో వెధవ గొడవలు, ఒకడు ఒక తెలివితక్కువ పని చెయ్యడం, మరొకడు మరొక తెలివైన పని చెయ్యడం, తన్నుకోడం, కొట్టుకోడం, వాటికి కారణాలేమిటి అంటూ ఈ లెక్చరర్లు మమ్మల్ని చంపుకుతింటున్నారు.

ఎవరో తలుపు తట్టినట్టనిపించి, ఖేడివ్ ఇస్మైల్‌ని అప్పుల్లో వదిలేసి, లేచి, తలుపు తీశాను.

అరుంధతి!

''ఇంత రాత్రప్పుడు.. ఇలా...'' అన్నాను ఆశ్చర్యంతో. అప్పుడు అయిదునిముషాలు తక్కువ తొమ్మిది.

''ఒక యాభై రూపాయలుంటే సర్దగలరేమో నని వచ్చేను,'' అంది సూటిగా చూస్తూ.

ఆమాట అర్థం కావడానికి నాకు అయిదు నిముషాలు పట్టింది.

''పెట్టెలో బట్టలు సర్దుకోడమే చేతకాదు నాకు'' అన్నాను నవ్వుతూ.

''నేనూ అదే అనుకున్నాను'' అంది తను చప్పున.

ఇంతవరకూ అక్కడ సీరియస్‌నెస్ లేదనే అనుకుంటున్నాను. ''ఎక్కడినించి వస్తున్నారు? ఏమిటి కథ'' అన్నాను.

తను మహిళామండలి సెక్రటరిగారింట్లో ఇద్దరు పిల్లలకి ట్యూషను చెప్పి వస్తూందిట. రోజూ పొద్దున్న ఇద్దరు పిల్లలు ఏడునించి ఎనిమిదివరకూ ఇంటికొచ్చి పాఠాల్చెప్పించుకు పోతారు. వాళ్లకి పాఠాలు చెప్తూ, వంట చేసుకుంటుంది. తొమ్మిదిన్నర ప్రాంతాల్లో ఓపినంతమటుకు ఫలహారాలవాళ్ళకి ఫలహారాలూ, భోజనాలవాళ్ళకి భోజనాలూ సిద్ధపరచి, తనూ రెండు మెతుకులు కతికి, స్కూలికి వెళ్తుంది. మధ్యాహ్నానికి ఇంటినించే ఫ్లాస్కులో కాఫీ తీసుకువెళ్తుంది. మళ్లీ సాయంత్రం ఓ గంటసేపు మహిళలకి జాకట్లు కత్తిరింపులు నేర్పుతుంది. ఇంటికి వెళ్ళి వంటా, వార్పూ, చూసుకోడం, మళ్లీ ఏడున్నర నించీ ఎనిమిదిన్నర వరకూ సెకండుఫారం చదివే ఇద్దరు పిల్లలకి ట్యూషను. ఇవి రెండూ కమిషనరు దగ్గిర పర్మిషను పుచ్చుకుని చెప్తున్నవి, పొద్దున్న చెప్తున్నవి రహస్యం.

అరుంధతి ఆ ఇంట్లో ఏ స్వర్గ సుఖాలు చవి చూస్తోందో?

''ఎందుకింత తాపత్రయం మీకు?'' అని అడిగాను.

నూరేళ్ళ జీవితం ముప్ఫై ఏళ్ళలో ముగించుకుంటే ఒరిగేదేమిటి? ఎవర్ని మెప్పించడానికి?

''ప్చ్'' అంది తను నావేపు ఒక చూపు చూసి, ''చూద్దాం''. ఆచూపు ఎలాటిదో చెప్పలేక 'ఒక చూపు' అన్నాను.

''మా చిన్నాడబడుచు పుట్టినరోజు వచ్చే శుక్రవారంనాడు. చీరెలూ, సారెలూ తక్కువయితే వీల్లేదు, నాలుగు వేళ్లూ నోట్లోకి పోకపోయినా...'' అంది అరుంధతి, వెలితిగా నవ్వి.

''ఏం మాటలండీ'' అన్నాను. అంతకన్నా ఏం అనను? పరీక్ష ఫీజుకని దాచిన మొత్తంలోంచి అయిదుపదులు తీసి అరుంధతి చేతిలో పెడుతుంటే, తనవదనం కృతజ్ఞతతో జాజ్వల్యమానమయింది. చూడనట్టు నటించాను.

''ఈ డబ్బు నేను మీకు తిరిగి ఇవ్వలేకపోతేనో?'' అంది సహం బాధగా, సహం వేళాకోళంగా.

''శిక్ష పడుతుంది''

''ఏమిటా శిక్ష?''

''ఏముందీ, మీ ప్రియబంధువుల్తో ఎడబాటూ, మా ఇంట్లో కారాగారమూను''

''మంచివారు కదూ. ఆమాట ముందే చెప్తే మరో పాతిక పుచ్చుకుందును''

''ముందు మీరు అప్పు తీర్చనని ప్రకటించాలి కదా'' అన్న నా మాటలు గాలిలో కలిసిపోయాయి.

అరుంధతి చిన్నాడబడుచు పుట్టినరోజు వేడుక ఎంత ఘనంగా జరుగుతుందో ఊహించుకుంటూ ఆరాత్రంతా గడిపాను. మర్నాడు అరుంధతి కొన్న కొత్త చీర చూపిస్తుందనీ, లేకపోతే పుట్టినరోజు మహోత్సవం చూడ్డానికి నన్ను పిలుస్తుందనీ, అనుకున్న నాఆశలు వమ్ము అయేయి. ఎలా చూసినా తన ఈ పని సమర్థనీయంగా లేదు. ఒకవేళ తనకి ఒంట్లో బాగులేదేమో? ఆదివారం వెళ్లి కనుక్కుందాం అనుకున్నాను.

✍✍✍

శనివారం పొద్దున్న నాగమణి చెప్పిన వార్త ఇదీ – అరుంధతి వెళ్లిపోయింది– కర్పూరం హరించిపోయినట్టు.

నేనిచ్చిన యాభై రూపాయలు జ్ఞాపకం వచ్చేయి. వెంటనే అలాంటి ఆలోచన వచ్చినందుకు నన్ను నేనే చీవాట్లు వేసుకున్నాను. అయితే అరుంధతి ఎందుకు వెళ్లిపోయినట్టు?

సాయంత్రం కిటికీ దగ్గిర కూచుని సన్నజాజి పూలు మాల కట్టుకుంటుంటే మగపిల్లలిద్దరూ కనిపించారు. పిలిచాను ఒకమారు ఇటు రమ్మని. పెద్దవాడు ఒకడుగు ముందుకి వేశాడు. చిన్నవాడు అన్నగారి చెయ్యి పట్టుకుని వెనక్కి లాగేడు.

గూట్లోంచి బిస్కెట్ పాకెట్ తీసి, ''ఇదుగో, మీ వదిన మీకు ఇవ్వమంది'' అన్నాను.

ఇద్దరి కళ్లూ ఆశగా మెరిశాయి. ఇందుకే అమాయకత్వం చూస్తే నాకు జాలేస్తుంది. ఆ పిల్లలిద్దరూ అంగుళం, సెంటిమీటరూ చొప్పున జరిగి నాకు గజం దూరం వచ్చేసరికి అరగంట పట్టింది.

''మీ వదిన ఎప్పుడు వస్తుంది?''

''ఇహ రాదు.''

''ఎందుకు వెళ్ళిపోయిందీ?''

''ఏమో!''

అంతకంటె ఏమీ తెలుసుకోలేకపోయాను.

కాని ఇలాటి విషయాలు దాచినా దాగవు.

''అబ్బో! అదెక్కడ? రాత్రీ పగలూ ఆ తిరగడాలూ,.. అప్పుడే అనుకున్నాను...'' అన్నారొకరు.

''బావుంది. ఛస్తుందేమిటి మరి. మంచిపనే చేసింది'' అన్నారు మరొకరు.

నలుగురూ నానారకాలుగా వ్యాఖ్యానాలు చేశారు.

ఆఖరికి తేలిందిది:

సాధారణంగా ఆ ఇంట్లో అరుంధతి మాట సాగదు. అసలు నిజం చెప్పాలంటే ఏ ఒక్కరి మాటా సాగదు. అలా తలో పెద్దా దండనాయకుడే అంటే అరుంధతికి నచ్చదు. అయినా చేసేది ఏం లేదని ఊరుకుంటూ వచ్చింది. 'ఎలా ఉన్నా గడిచిపోతుంద'న్న ఫిలాసఫీతో. కాని రోజులు అంత తేలిగ్గా సాగలేదు. స్కూలికి వెళ్తున్న చిన్నమ్మాయి

ఇంట్లో చెప్పకుండా సినిమాలకెళ్ళడం మొదలెట్టింది.

ఇంట్లో డబ్బు మాయమవుతోంది.

ఆ సంగతి అరుంధతి గ్రహించి నీతులు భోధించబోయింది. దాంతో ఆపిల్లకి ఒళ్లు మండింది.

''నా ఇష్టం. నీకెందుకు?'' అంది ఆఅమ్మాయి. అరుంధతి నిశ్చేష్టురాలై నిలబడిపోయింది.

''దాని విషయంలో నువ్వెందుకు జోక్యం కలుగజేసుకోడం?'' అంది అత్తగారు సమరసభావంతో.

''అయినా ఈరోజుల్లో ఎవరంతటివాళ్ళు వాళ్ళు. పిల్లని తల్లి అంటేనే పడదు. పనిమనిషి వంటిది మాట అంటే తోముతున్న గిన్నె అక్కడే పారేసి పోతుంది. అలాటిది కాన్డబ్బు ఇస్తున్నాం అని స్వవిషయాల్లో జోక్యం కలగజేసుకుంటే వినేదెవరు?'' అంది పెంపుడు అత్తగారు.

''చిన్న దాన్ని. కోపం వద్దు, వదినా. రోజులిలా ఉన్నాయి. ప్రతిమనిషికీ తనమీద, తనతెలివితేటలమీద ఉన్న నమ్మకం మితి మీరిపోయింది. ఇతరుల అనుభవాలనించి నేర్చుకుందాం అన్న ఆలోచన ఉన్నవాడు వెర్రివాడు. అది అడిగిన రెండువేలూ తెచ్చి ఇచ్చి. అవి అయిపోగానే దానికే బుద్ధి వస్తుంది. అక్కడికది చవకే కదూ!'' అంది దైవ చింతనగల పెద్దావిడ.

రోజులిలా ఉంటే తనెందుకు ఇలా ఉండాలో అరుంధతికి అర్థం కాలేదు.

''నా డబ్బు పనికొచ్చి, నా మాట పనికిరాకపోతే, నేనిక్కడ ఉండడం అనవసరం'' అంది అరుంధతి.

అరుంధతి వెళ్లిపోయింది.

రెండేళ్ళనాడు, ఇరవై పోస్టుముద్రలతో, ఒక కవరు వచ్చింది నాకు. ఆముద్రల మధ్యనించి ఆ ఎడ్రెసు రాసిన కలం పోల్చుకోడం కష్టమే అయింది. అది అరుంధతిది.

''జరిగిన సంగతి మీరు వినే ఉంటారు. నేను చేసింది సరైనదవునో? కాదో? --ఆ క్షణంలో ఆవేశంతో అక్కణ్ణుంచి వచ్చేశాను. ఒక చిత్రమైన సంఘటన వల్ల ''మా ఆయన్ని'' కలుసుకున్నాను. దైవోపహతురాలిని. పలుదోమ పుల్లకోసం చెట్టెక్కితే, సంజీవకరణి దొరికిందన్న ఆశ ఆశగానే ఉండిపోయింది, మాలతీ! ఇద్దరు పిల్లల్ని నా చేత పెట్టి ఆయన పోయారు. పెంచుతున్నాను, వీళ్లని.''

--వీళ్ళింక పెరిగి పెద్దవాళ్ళయి తనని ఉద్ధరిస్తారని అరుంధతి ఆశ పడుతోందని నేననుకోను. అప్రయత్నంగా ఎక్కడో చదివిన పద్యం జ్ఞాపకం వచ్చింది.

''నీచేతను, నా చేతను, వరమడిగిన కుంతిచేతను, వాసవుచేతను, ధరచేతను, భార్గవుచేతను''--ఆరుగురిచేత వంచింపబడ్డాడు మహారథి కర్ణుడు. అయితే ఏం? ఆఖరిక్షణం వరకూ యుద్ధం చేస్తూనే ఉన్నాడు.

అరుంధతి జీవిస్తూనే ఉంది.

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక, 11 జనవరి 1961లో ప్రచురితం)